అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

- కోనరావుపేటలోని పలు గ్రామాల్లో పంచాయతీ భవనాల దుస్థితి
- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- శిథిల భవనాల్లోనే సిబ్బంది విధులు



అసంపూర్తిగా కోనరావుపేట పంచాయతీ భవనం

కోనరావుపేట: కోనరావుపేటలో గ్రామపంచాయతీ భవనం లేక ఇబ్బంది పడుతున్నారు. నూతన భవనానికి నిధులు మంజూరైనా నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. శిథిలమైన భవనంలో, అరకొర వసతుల మధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

శిథిల భవనంలో విధులు

మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇదే భవనంలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సభలు, సమావేశాలు జరుపుకునేందుకు కూడా సరిపడా స్థలం లేకపోవడంతో ఎలాంటి సమావేశాలైనా భవనం ముందు ఉన్నచెట్ల కిందే టెంట్లు వేసి నిర్వహించుకోవాల్సి వస్తోంది. మండలకేంద్రం అయినా పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

రూ.50 లక్షలు మంజూరు

మండలకేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధిహామీ నిధులనుంచి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొంతమేర పనులు పూర్తిచేశాడు. డీఎంఎఫ్టీ నిధులు రూ. 30 లక్షలు ఏడాదిన్నర క్రితం మంజూరయ్యాయి. కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు జరుగడంలేదు. దీంతో గ్రామస్తులు, అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

కోనరావుపేట మండలంలోని 21 గ్రామాలున్నాయి. 7 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. 17 గ్రామాల్లో పంచాయతీ భవనాలకు ఉపాధిహామీలో ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో సుద్దాల, కొండాపూర్, రాజన్నగొల్లపల్లి(కొలనూర్)లో భవనాలు పూర్తయ్యాయి. కనగర్తి, మల్కపేట, వట్టిమల్ల, గోవిందరావుపేట తండా, మరిమడ్ల, మామిడిపల్లి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఎగ్లాస్‌పూర్‌లో స్థలంలేక పనులు జరుగడంలేదు. కొలనూర్, పల్లిమక్త గ్రామాల్లో పాత భవనాలను కూల్చివేసే పనులే ఆగిపోయాయి.

త్వరగా పూర్తిచేయాలి



కోనరావుపేట గ్రామపంచాయతీకి ఇప్పటివరకు సరైన వసతి లేకపోవడంతో అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. భవనానికి నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి.

– దండు శ్రీనివాస్, కోనరావుపేట

చెట్ల కిందే సమావేశాలు



మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు జాప్యం అవుతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పాతభవనం లోపల స్థలం లేకపోవడం సమస్యగా మారింది. ఎలాంటి సమావేశమైనా ముందు వరండాలో, లేదా చెట్లకిందనే నిర్వహించుకోవాల్సి వస్తుంది. అధికారులు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి.

– రాస రత్నాకర్, కోనరావుపేట

టెండర్లు పూర్తికాగానే పనులు



కోనరావుపేట గ్రామపంచాయతీ భవనానికి మొత్తం రూ. 50 లక్షలు మంజూరయ్యాయి. మొదటి రూ. 20 లక్షలు పూర్తికాగానే మిగితావి సాంక్షన్ ఇస్తామన్నారు. ప్రస్తుతం రూ. 20 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. మిగతా రూ.30 లక్షల పనులు టెండర్ ప్రక్రియ వద్ద నిలిచిపోయాయి. టెండర్లు పూర్తికాగానే జీపీ భవనానికి మిగతా పనులు పూర్తిచేయిస్తాం.

– అంజయ్య, ఏఈ, పంచాయతీరాజ్

కనీస వేతనాలు అమలు చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అశోక్, తదితరులు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అశోక్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభల పోస్టర్‌ను గురువారం సిరిసిల్లలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14 ,15 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, నాయకులు సూరం పద్మ, శ్రీరాముల రమేశ్ చంద్ర, కాసారపు శంకర్, సుల్తాన్ నర్సయ్య, రెడ్డిమల్ల రాజయ్య, ఏల్పుల బాలయ్య, బాబా కిషన్, శ్రీనివాస్, మల్లేశం, మమత, లక్ష్మి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

రుణం చెల్లించినా ఒత్తిడి చేస్తున్నారు

- కోనాయపల్లి మహిళా సంఘాల సభ్యులు
- యూనియన్ బ్యాంక్ ఎదుట నిరసన


వేములవాడ యూనియన్ బ్యాంక్ ముందు పురుగు మందు డబ్బాలతో కోనాయపల్లి మహిళల నిరసన

వేములవాడ: తాము తీసుకున్న రుణం డబ్బులు చెల్లించినా మళ్లీ కట్టాలని బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారంటూ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మందుడబ్బాతో వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణం మొత్తాన్ని మెప్మా ప్రతినిధికి చెల్లించినట్లు ఆధారాలు ఉన్నాయని, అయినా బకాయి ఉన్నట్లుగా బ్యాంక్ అధికారులు చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనాయపల్లి పరిధిలోని కొన్ని మహిళా సంఘాల్లో నగదు గోల్‌మాల్ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. వారం రోజులుగా మెప్మా, బ్యాంక్ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఆడిట్ తనిఖీలలో కొన్ని లోపాలు తేలినట్లు సమాచారం. ఆడిట్ అనంతరం తేలిన బాకీ సొమ్మును చెల్లించాలని అధికారులు సూచించారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని బ్రాంచ్ మేనేజర్ సురేశ్‌బాబు తెలిపారు. దీంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బోయినపల్లికి రెండు బస్సు సర్వీసులు

- గంగాధర–వేములవాడ రూట్‌లో ఒకటి
- కరీంనగర్–సిరిసిల్ల మార్గంలో మరొకటి


బోయినపల్లి–గంగాధర ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు

బోయినపల్లి: బోయినపల్లి మండలానికి పలు బస్సులు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న తీరుపై 'గంగ స్నానానికి వచ్చేదెట్లా?' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. గురువారం నుంచి బోయినపల్లి మండలం మీదుగా రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. సిరిసిల్ల–కరీంనగర్ (వయా బోయినపల్లి, గర్శకుర్తి, విలాసాగర్) బస్సు, గంగాధర–వేములవాడ రెండు బస్సులను ప్రారంభించారు.

పర్మినెంట్ ఉద్యోగి స్థానంలో ప్రైవేట్ వ్యక్తి

- ఆగ్రహం వ్యక్తం చేసిన రాజన్న ఆలయ ఈవో

వేములవాడ: రాజన్న ఆలయంలో పర్మినెంట్ ఉద్యోగికి బదులు ప్రైవేట్ వ్యక్తి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం గమనించిన ఈవో రమాదేవి ఆలయ అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్వామివారి నిత్య నివేదనశాలలో వంటమనిషిగా పనిచేస్తున్న ఉద్యోగి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. నివేదనశాలలో నిత్యం మడితో కూడిన వంటకాలు చేసి స్వామివారికి నివేదించాల్సి ఉంటుంది. అయితే మొత్తం నలుగురు ఉద్యోగులకు ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. ఇటీవల ఇద్దరిలో మరొకరు గైర్హాజరు కావడంతో ఈ విషయం బయటకు పొక్కింది. గైర్హాజరైన వ్యక్తి మరో ఉద్యోగి అసలు విధులకే హాజరుకావడం లేదని ఈవోకు తెలిపారు. నాలుగేళ్లుగా మరొకరితో పనిచేయిస్తున్నారని వివరించారు. కాంట్రాక్టు విభాగంలోని కొందరు ఉద్యోగులు సైతం ఇదే తరహాలో పనిచేస్తున్నట్లుగా ఈవో దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఆగ్రహం వ్యక్తం చేసిన ఈవో మిగతా విభాగాల్లోని ఉద్యోగుల వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం



సిరిసిల్లటౌన్: జనాభాలో అత్యధికుల పేర్లు శ్రీనివాస్‌లున్నారని, తామంతా మా పేరు సార్థకతను గిన్నీస్ రికార్డు సాధిస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం నిర్వాహకులు జిల్లాకేంద్రంలోని హరిహర బ్యాంకెట్ హాలులో శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస మిత్రుల వ్యవస్థాపకుడు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. గతేడాది నుంచి శ్రీనివాస మిత్రుల కార్యక్రమాలను సిరిసిల్ల శ్రీనివాసులకు వివరించారు. తలసేమియా రోగులకు రక్తదానం, విద్యార్థులకు నోట్‌బుక్స్‌తోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 26న పీవీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా శ్రీనివాసుల మిత్రులతో ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు.అదేరోజు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమం ఉంటున్నందున ప్రతీ శ్రీనివాసుడు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల శ్రీనివాస మిత్రులు చొక్కి శ్రీనివాస్, కామారపు శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, మోర శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, భీమవరం శ్రీనివాస్, చొప్పదండి శ్రీనివాస్, బూర శ్రీనివాస్, తదితర శ్రీనివాసులు పాల్గొన్నారు.

హామీలిచ్చి మోసం చేసింది బీఆర్‌ఎస్సే

తంగళ్లపల్లి: పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 24 రకాల హామీలను ఇచ్చి అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాపాలనపై వారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ అరెపల్లి బాలు, నాయకులు మునిగెల రాజు, రాజశేఖర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్



ఇల్లంతకుంట: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, బాకీ పడ్డ హామీలను అమలుచేయాలని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల బాకీ కార్డులను చూపిస్తూ మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బాకీ హామీలను వివరిస్తామన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, చేకూర్తి రాజిరెడ్డి, ఒగ్గు నర్సయ్య, వెంకట నరసింహారెడ్డి, కట్ట వెంకటరెడ్డి, బిల్లవేని పరుశురాం, ఎస్ అనిల్, రఘు, దమ్మని మధు, తిరుపతి రెడ్డి, ఎండీ సాదుల్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయి ఇంటికి చేరాడు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లికి చెందిన బండి లావణ్య– మహేందర్ దంపతుల కుమారుడు రాజేశ్ ముస్తాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. బుధవారం హాస్టల్ నుంచి బయట కెళ్లాడు. దీంతో తల్లి దండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు, హాస్టల్ నిర్వాహకులు ఎంతసేపు వెతికినా రాజేశ్ కనిపించలేదు. మూడు గంటల అనంతరం రాజేశ్ ఇల్లు చేరగా తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని సిరిసిల్లకు మార్చాలి


కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల అర్బన్: చేనేత, జౌళి శాఖ కార్యాలయాన్ని కార్మికులకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్ నుంచి సిరిసిల్ల పట్టణానికి మార్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు, చేనేత జౌళిశాఖ ఏడీకి గురువారం వినతిపత్రం అందజేసినట్లు పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో వివిధ రంగాలపై ఆధారపడి పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు బీవై నగర్‌లోని ఆఫీస్ అందుబాటులో ఉండేదన్నారు. కలెక్టరేట్‌కు మార్చడంతో ఏదైనా సమాచారం కోసం కార్మికులు ఇక్కడి వరకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, కార్మికులు ఉడుత రవి, రమేశ్, జగదీశ్, శ్రీధర్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో కాలువ పునరుద్ధరణ

- 70 మంది రైతులకు లబ్ధి


జేసీబీతో రగుడులోని మైసమ్మకుంట కాలువ పనులు చేయిస్తున్న బూర యాదగిరి

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణ పరిధిలోని ఒకటో వార్డులోని రగుడు మైసమ్మకుంట కాలువ మరమ్మతు పనులు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బూర యాదగిరి జేసీబీతో చేయించారు. దీంతో సుమారు 70 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రగుడు శివారులో 11 ఎకరాల విస్తీర్ణంలో మైసమ్మకుంట చెరువు ఉంది. దీని కింద 130 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 70 మంది రైతులు ఈ చెరువు కాలువ నీటిపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. చెరువులోకి వరద వచ్చే కాల్వలో మట్టి, ముళ్లచెట్లతో నిండిపోవడంతో నీరు రాకుండాపోయింది. దీంతో పంటలు సరిగా పండలేవు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు రాకుండా పంటచేలలోకి వెళ్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. బూర యాదగిరి సొంతంగా ఖర్చు భరించి కాల్వను పునరుద్ధరించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కాలువ ద్వారా చెరువులోకి వరదనీరు వచ్చి చేరింది. 300 మీటర్ల పొడవు కాల్వను పునరుద్ధరించేందుకు రూ.10వేల వరకు ఖర్చు పెట్టాడు.

సాహితీ ప్రక్రియల్లో బాలలకు పోటీలు

సిరిసిల్లకల్చరల్: బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పలు సాహితీ ప్రక్రియల్లో పిల్లలకు పోటీలు నిర్వహించనుంది. పద్యం, కవిత, గేయం, కథ, నాటిక ప్రక్రియల్లో పిల్లలు తమ రచనలను నవంబర్ 5వ తేదీలోపు పంపించాలని అకాడమీ కోరుతోంది. ఎంచుకున్న ప్రక్రియపై 25 పంక్తులకు మించకుండా ఉండాలని, కథ ఏ4 సైజ్‌లో మూడు పేజీలకు, నాటిక ఆరు పేజీలకు మించరాదని పేర్కొన్నారు. ఒక్కో పేజీలో 20 పంక్తులు దాటకుండా స్వీయ రాత ఉండాలని, శీర్షిక తప్ప మరే ఇతర వివరాలు ఉండకూడదని స్పష్టం చేశారు. దేశభక్తి, దేశ సమగ్రత, తెలంగాణ విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణం, పచ్చదనం వంటి నేపథ్యంతో సాహిత్య ప్రక్రియలు ఎంచుకోవాలని సూచించారు. తమ రచనలను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణపత్రాన్ని జతచేసి తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ చిరునామాకు పంపించాలని కోరారు. వివరాలకు 91824 45692లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని 36వ వార్డు పరిధిలోని వెంకంపేట, ప్రగతినగర్, సుందరయ్యనగర్‌తోపాటు, బోనాల వద్ద విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. గురువారం బోనాల రోడ్డులోని చర్చి వద్ద విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు, సెస్ డైరెక్టర్ రమాదేవి శ్రీనివాస్‌తో మాట్లాడారు. సెస్ ఏఈ, మల్లయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నెమలిని కాపాడారు

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో రైతు వెంకటేశ్ బావిలో బుధవారం నెమలిపడింది. ఉదయం బావి వద్దకు వెళ్లిన రైతు బావిలోంచి కేకలు గుర్తించి నెమలిబావిలో పడిపోయినట్లు భావించాడు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి వెంకటేశ్ సహాయంతో నెమలిని కాపాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు

బోయినపల్లి: వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపవద్దని ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. బోయినపల్లి గ్రామ పరిసరాల్లో గురువారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని కోరారు. హెచ్‌సీ ప్రకాశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదమా.. నిప్పంటించారా?

- ప్రమాదానికి గురైన కారు దగ్ధం


దగ్ధమైన కారు

ముస్తాబాద్: మండలకేంద్ర శివారులో బుధవారం రాత్రి కల్వర్టుకు ఢీకొట్టిన కారు.. గురువారం తెల్లవారే సరికి కాలిపోయింది. ముస్తాబాద్‌కు చెందిన సతీశ్, మనోజ్ మరో ఇద్దరు వెంకటేశ్వర్ల గుట్ట రహదారిలో కారులో వెళ్తూ కల్వర్టును ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో సతీశ్, మనోజ్ తీవ్రంగా గాయపడగా, సిద్దిపేటలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే ప్రమాదానికి గురైన కారు కాలిపోయింది. గురువారం తెల్లవారుజామున పొలాలకు వెళ్తున్న రైతులకు కాలుతున్న కారు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వచ్చేసరికే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. అయితే కారుకు ఎవరైనా నిప్పు పెట్టారా.. లేక ప్రమాదంలో ధ్వంసమైన కారు నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడి కాలిపోయిందా అనే కోణంలో విచారిస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వేములవాడలో కత్తిపోట్లు కలకలం

వేములవాడ: ఓ యువకుడు కత్తిపోట్లకు గురైన ఘటన బుధవారం అర్ధరాత్రి వేములవాడలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి భాను, కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలోని ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని కొద్దిరోజులుగా కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు. బుధవారం రాత్రి కొందరు కాపుకాసి భానుపై కత్తితో దాడిచేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రి, తర్వాత కరీంనగర్‌లోని ఆసుపత్రి, అనంతరం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. భాను పరిస్థితి విషమంగా ఉందని, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

సిరిసిల్ల టౌన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు హౌజ్ అరెస్టుపై బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు చార్జీలను 50 శాతం పెంచిన ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నేతలు కేటీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ భవన్ వద్ద వినతిపత్రం ఇచ్చేందుకు ముందే నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. ఇక్కడ మట్టి శ్రీనివాస్, శివరాం, అడిచర్ల సాయి, గాజుల మహేశ్, సంపత్, వెలమల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన

తంగళ్లపల్లి: వ్యవసాయ రంగంలో ఉద్యోగావకాశాలపై గురువారం జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమృద్ధి ఈకో అగ్రిక్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోఫౌండర్ మెండు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. సునీతా దేవి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డా. ఆర్.సతీశ్, డా. భవ్యశ్రీ, వ్యవసాయ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయం నిర్మిస్తాం

సిరిసిల్లటౌన్: అయోధ్య రామ మందిరం స్ఫూర్తితో సిరిసిల్లలో మార్కండేయ ఆలయాన్ని నిర్మిస్తామని మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ కమిటీ కన్వీనర్ మోర శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. మార్కండేయస్వామి ఆలయం పునర్ నిర్మాణంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తామన్నారు. మేర్గు సత్యనారాయణ, మాదాసు శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కోడం రవి, గుంటుక పురుషోత్తం, చిమ్మని ప్రకాశ్, గాజుల సదానందం, గుడ్ల విష్ణు, రవి, ఎనగంటి నరేశ్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రుద్రంగి: మండలకేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో మండలస్థాయి పోషణమాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు వేములవాడ సీడీపీవో సౌందర్య రాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం, అన్నప్రాసన, అక్షరా భ్యాసం నిర్వహించారు. మండల సూపర్‌వైజర్ మమత, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

మండలస్థాయి చెస్ పోటీలు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో విన్నర్‌గా జి.శర్వాణి (జెడ్‌పీహెచ్‌ఎస్ నిజామాబాద్), రన్నర్‌గా ఏ. హరిణి (సుద్దాల) సాధించారు. అండర్–14 బాలుర విభాగంలో విన్నర్‌గా సీహెచ్. కార్తీక్ (నిజామాబాద్), రన్నర్‌గా ఎస్‌కే. ఉస్మాన్ (నిజామాబాద్) సాధించినట్లు ఎంఈవో మురళీనాయక్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సంతోష్ తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో విన్నర్‌గా హరిణి (నిజామాబాద్), రన్నర్‌గా జెన్నీఫర్, అండర్–17 బాలుర విభాగంలో విన్నర్‌గా సిద్దార్థ (మరిమడ్ల), అశ్విత్ (కనగర్తి) రన్నర్‌గా నిలిచారు. వీరికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు అజయ్‌కుమార్, సంతోష్, హెప్సిబా, ఉపాధ్యాయులు గొట్టిముక్కుల శేఖర్, సిరిపురం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూలవాగు పరవళ్లు


మూలవాగు చెక్ డ్యాంపై ప్రవహిస్తున్న నీరు

వేములవాడ రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు మూలవాగులో నిర్మించిన చెక్ డ్యాంలోకి నీరుచేరింది. దీంతో మూలవాగు ప్రాంతంలో ఉన్న రైతులు, గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హన్మాజీపేట, మల్లారం, వేములవాడ ప్రాంతంలో నాలుగు చెక్ డ్యాంలను మూలవాగుపై నిర్మించారు. ఈ వాగుపైన వస్తున్న నీరు చెక్ డ్యాంల వద్ద బ్యాక్ వాటర్ పెరిగి మత్తడి దూకుతోంది.

గుర్తు తెలియని వ్యక్తులకు చికిత్స




సిరిసిల్ల క్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇద్దరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. వివరాలు తెలిస్తే సిరిసిల్ల టౌన్ సీఐ 87126 56366, ఆస్పత్రి ఆర్‌ఎంవో 9885 312004 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

● ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో గత సీజన్‌లో కొనసాగిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రస్తుతం తమకు కేటాయించడం లేదని వీవోలు అన్నారు. గురువారం మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో వీవోలు కలెక్టర్ హరితను కలిసి యథావిధిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించాలని కోరారు. మండలంలోని అక్కపల్లి, దుమాల, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్, నారాయణపూర్, కిషన్‌దాస్‌పేట, రాచర్లబొప్పాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గత సీజన్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ వివిధ గ్రామాల మహిళ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు బహుమతులు అందజేత

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఎస్సే కాంపిటేషన్ నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌తో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సే కాంపిటేషన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ సంతోష్, కొలిపాక నర్సయ్య, వంశీకృష్ణ, శ్రీనివాస్, మనోహర్, ప్రవీణ్, మధు, రాంప్రసాద్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం రాత్రి ఎస్సై రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపిన వివరాలు. వెంకటాపూర్‌కు చెందిన పంతంగి ఎల్లయ్య ఇంట్లో కిరాయికి ఉంటున్న కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ముచ్చర్ల జంగయ్య గ్రామంలో పలువురి నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేశాడు. ఇక్కడ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు కామారెడ్డిలో విక్రయిస్తున్నాడు. కొంతకాలంగా జంగయ్య ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి ఇంట్లో డంపు చేసినట్లు సమాచారం అందడంతో దాడి చేసి 3.5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. జంగయ్యపై కేసు నమోదు చేశారు.

● ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: అక్రమంగా ట్రాలీ ఆటోలో ఇసుక తరలిస్తున్న వ్యక్తిని గురువారం పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. పోలీసులు గురువారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తుండగా బండలింగంపల్లిలో ట్రాలీ ఆటోలో ఇసుక తరలిస్తున్న వ్యక్తిని ఆపారు. దుబ్బాకకు చెందిన మాధవిని రాజుగా గుర్తించి ఆటోను ఠాణాకు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.